సాక్షి
విశాఖపట్నం
గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



మేము సిద్ధం : సీఎం ప్లకార్డులతో అభిమానులు

ఆధ్యాత్మిక గుబాళింపు



యాగశాలలో రాజశ్యామల అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్



అమ్మవారి దీక్షా పీఠంలో పూజలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్, పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలు



జమ్మి చెట్టుకు మొక్కుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

- వైభవంగా రాజశ్యామల యాగం
- క్రతువులో పాల్గొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- దాదాపు రెండున్నర గంటలపాటు పూజాది కార్యక్రమాల నిర్వహణ
- సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు తరలివచ్చిన అశేష జనవాహిని
- ప్రతీ ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడిన సీఎం

పెందుర్తి: జగన్మాత సన్నిధిలో సర్వప్రాణి శ్రేయస్సు కోసం తలపెట్టిన రాజశ్యామల హోమంతో ఆధ్యాత్మికత గుభాళించింది. ఆ ఆధ్యాత్మిక క్రతువుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరై భక్తజనంతో పాటు పండిత పెద్దలు.. వేద విద్యార్థులతో మమేకమై ఆత్మీయంగా పలకరించడంతో ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం పులకించింది. చినముషిడివాడలోని శ్రీశారదాపీఠంలో బుధవారం సందడి నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముగింపు వేడుకలకు హాజరై దాదాపు రెండున్నర గంటలపాటు పీఠ ప్రాంగణంలోని వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

ఉట్టిపడిన ఆధ్యాత్మికత

రాజశ్యామల యాగంతో బుధవారం ఉదయం నుంచి శ్రీశారదా పీఠం వేదఘోషతో మార్మోగింది. మధ్యాహ్నం 12.27 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీఠానికి చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం వేదపండితులు సీఎంకు సాదరస్వాగతం పలికారు. సంప్రదాయ వస్త్రధారణలో జగద్గురు సన్నిధిలోకి ప్రవేశించిన సీఎం వైఎస్ జగన్ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీలను కలుసుకుని అభివాదం చేసి ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరం స్వామీజీలు, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డితో కలిసి పీఠం అనుష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారికి విశేష పూజలు జరిపారు. సుబ్రహ్మణ్యస్వామి, దాసాంజనేయస్వామి దర్శనం చేసుకున్నారు. జమ్మిచెట్టుకు ప్రదక్షిణ చేశారు. రాజశ్యామల యాగం పూర్ణాహుతిలో సీఎం పాల్గొని అద్వితీయ ఘట్టాన్ని ఆద్యంతం తిలకించారు. యాగ భస్మాన్ని స్వామీజీ స్వయంగా సీఎం వైఎస్ జగన్ నుదుట దిద్దారు. వేదపండితులకు సత్కారం చేశారు. పలువురు వేద విద్యార్థులతో ముచ్చటించి ఉత్సాహం నింపారు. సన్నిధానంలో స్వామీజీతో సీఎం పలు అంశాలపై చర్చించారు. ఇరువురు స్వామీజీలు సీఎంను ఘనంగా సత్కరించి శంకరాచార్యుల ప్రతిమను అందజేశారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు శుభాకాంక్షలు

పీఠానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు. అదీప్‌రాజ్ జన్మదినం కావడంతో సీఎం ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు అందించారు. అదీప్‌రాజ్ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు.



నటరాజ స్వామికి పూజలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్

పీఠ ప్రాంగణంలో సందడి

ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా నాలుగోసారి పీఠానికి వచ్చారు. ఆయనతోపాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల రాకతో పీఠం ప్రాంగణంలో సందడి నెలకొంది. పీఠానికి వచ్చే సాధారణ భక్తులతో పాటు సీఎంను చూసేందుకు తరలివచ్చిన భక్తులతో శారదా పీఠం పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి. భద్రతా కారణాల రీత్యా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు పీఠం తరపున ప్రసాద వితరణ చేపట్టారు.



అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చిన ప్రజలు

దారి పొడుగునా నీరాజనం



అదిగో మన జగనన్నా..



ప్రజలకు నమస్కరిస్తున్న సీఎం జగన్

- సీఎం జగన్‌కు ఘనస్వాగతం పలికిన ప్రజలు
- శారదా పీఠం వరకు రోడ్లకిరువైపులా సిద్ధం ప్లకార్డుల ప్రదర్శన
- ప్రజలకు అభివాదం చేస్తూ మెల్లగా కదిలిన సీఎం

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి విశాఖ పర్యటనలో ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. బుధవారం విశాఖ శ్రీ శారదా పీఠంలో పూర్ణాహుతిలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు నీరాజనాలు పలికారు. తమ అభిమాన నేతను చూసేందుకు దారి పొడవునా అభిమానులు ఆసక్తి ప్రదర్శించారు. ఎండను సైతం లెక్కచేయకుండా గంటలకొద్ది వేచియుండి ఆయనపై ఉన్న అభిమానాన్ని, కృతజ్ఞతాభావాన్ని చాటుకున్నారు. పలు చోట్ల రోడ్డు మీదకు దూసుకువచ్చిన అభిమానులు, పార్టీ కార్యకర్తలు.. కారులో ఉన్న సీఎంతో సెల్ఫీలు తీసుకునేందుకు ప్రయత్నించారు. ముందుకు వస్తున్న అభిమానులు, పార్టీ కార్యకర్తలను అదుపు చేయడం పోలీసులకు కత్తి మీద సాములా మారింది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతీ ఒక్కరూ ఓపికతో నిలబడి ప్లకార్డులు, జెండాలు ప్రదర్శిస్తూ తమ అభిమాన నేతకు ఘన స్వాగతం పలికారు. పలు చోట్ల తీన్‌మార్లు, తప్పెటగుళ్ల కళాకారులు ప్రదర్శనలు చేశారు.



సంక్షేమ సారథికి కృతజ్ఞతా వందనం

వైఎస్సార్ సీపీలోకి జనసేన నాయకురాలు



పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో 61వ వార్డు జనసేన సీనియర్ నాయకురాలు మునంపాక నాగమణి, అప్పారావు దంపతులు సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

న్యూస్‌రీల్


విశాఖ చేరుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున

గోపాలపట్నం: నగరంలో జరుగుతున్న మిలాన్–2024లో పాల్గొనేందుకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం సాయంత్రం 5.29 గంటలకు ఢిల్లీ నుంచి విశాఖ చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో ఆయనకు కలెక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప, నేవీ అధికారులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో నగరంలోని నోవాటెల్ హోటల్‌కు గవర్నర్ బయలుదేరి వెళ్లారు.

5,536 మందికి వైద్య సేవలు



బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా బుధవారం తోట వీధి(భీమిలి), శ్రీకాంత్‌నగర్, ముత్యమాంబ కాలనీ, పెదగంట్యాడ, న్యూగాజువాక, సిద్ధేశ్వరం, రైల్వేన్యూకాలనీ, బాపూజీనగర్, శివానగర్, జబ్బరితోట, లాసన్స్‌బే కాలనీ, బాలాజీనగర్, వాంబేకాలనీలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో మొత్తం 5,536 మందికి వైద్య సేవలందించారు. 21 మందిని ఆరోగ్య శ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు సిఫారసు చేసినట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. రుషికొండ, మధురవాడ, భానోజీనగర్, విద్యానగర్ కాలనీ, కొబ్బరితోట, జేఎస్ఎం కాలనీ, అంబేడ్కర్ కాలనీ, మాధవధార, సిద్ధేశ్వరం, చంద్రానగర్‌లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో వెల్లడించారు.

గంటాకు సీటు తంటా!

- చీపురుపల్లికి పోవాలంటున్న అధిష్టానం
- భీమిలి కావాలంటూ పట్టు
- ఇందుకోసం కార్పొరేటర్లతో డ్రామాలు
- పట్టించుకోని టీడీపీ పెద్దలు
- జనసేనకు భీమిలి కేటాయిస్తామంటూ టీడీపీ పెద్దల నుంచి సందేశం
- తన ఓటమి కోసమే నాటకాలాడుతున్నారని గంటా మండిపాటు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఎన్నికలు వచ్చిన ప్రతీసారి సీటు మార్చి బరిలో నిలిచే గంటాకు ఇప్పుడు తన సీటు ఎక్కడో తెలియని పరిస్థితి ఏర్పడింది. భీమిలి నుంచి పోటీ చేయాలని గంటా భావిస్తుండగా.. చీపురుపల్లికి పంపాలంటూ టీడీపీ పెద్దలు భావిస్తున్నారు. ఇదే విషయాన్ని కొన్ని ఎంపిక చేసిన మీడియా సంస్థలకు టీడీపీ పెద్దలే లీకు చేయడం గంటాకు కునుకులేకుండా చేస్తోంది. ఎలాగూ ఎన్నికలకు ఒకసారి సీటు మార్చే అలవాటు ఉన్న గంటాను ఈసారి చీపురుపల్లికి పంపాలని భావిస్తున్నట్లు రాబిన్ శర్మ ద్వారా సందేశం పంపినట్లు సమాచారం. ఇది తనను ఓడించేందుకే ఆడుతున్న నాటకమని కూడా గంటా మండిపడినట్లు తెలుస్తోంది. చీపురుపల్లిలో తాను గెలిచే అవకాశం లేదని గంటాకు స్పష్టంగా తెలుసు. అందుకే చీపురుపల్లి నుంచి పోటీ చేసే ప్రసక్తే లేదని టీడీపీ పెద్దలకు తేల్చిచెప్పినట్లు సమాచారం. గత వారం రోజులుగా ఈ వ్యవహారం నడుస్తున్నప్పటికీ గంటా మాటను ఖాతరు చేయకుండా టీడీపీ పెద్దలే తమ అనుకూల మీడియాకు తాజాగా లీకులివ్వడంతో ఏమీ చేయాలో గంటా కాస్తా తేల్చుకోలేకపోతున్నారు. అంతేకాకుండా గంటా కోరుతున్న భీమిలి సీటును జనసేనకు కేటాయిస్తున్నట్టు కూడా టీడీపీ పెద్దలు లీకులిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేరుగా చంద్రబాబుతో తాడోపేడో తేల్చుకునేందుకు గంటా సిద్ధమవుతున్నట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

నెల్లిమర్ల.. చోడవరంలోనూ వ్యతిరేకత...!

వాస్తవానికి వచ్చే ఎన్నికల్లో విశాఖ జిల్లా నుంచి కాకుండా తన సామాజికవర్గం అధికంగా ఉండే నెల్లిమర్లలో పోటీ చేయాలని గంటా మొదట భావించారు. అయితే, అక్కడ స్థానిక టీడీపీ నేతల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఆ ప్రతిపాదనను విరమించుకున్నారు. ఆ తర్వాత చోడవరం నుంచి బరిలో దిగితే ఎలా ఉంటుందని అభిప్రాయసేకరణ చేశారు. అయితే, గతంలో గెలిచి అక్కడ తన గెలుపునకు కృషిచేసిన వారిని ఏ మాత్రమూ పట్టించుకోకపోవడంతో పాటు నియోజకవర్గాన్ని గాలికివదిలేశారన్న విమర్శలున్నాయి. దీంతో చివరకు భీమిలి నుంచి బరిలో దిగేందుకు ఆయన నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ప్రస్తుతం భీమిలి ఇన్‌చార్జిగా ఉన్న కోరాడ రాజబాబుకు వ్యతిరేకంగా పావులు కదపడం ప్రారంభించారు.

కార్పొరేటర్లతో నాటకాలు...!

వాస్తవానికి భీమిలి సీటు నుంచి పోటీ చేయాలని గంటా భావిస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే టీడీపీ నుంచి ఉన్న కోరాడ రాజబాబుకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్నారు. కొద్దిరోజుల క్రితం నేరుగా లోకేష్‌ను కలిసి సదరు కార్పొరేటర్లు కోరాడ రాజబాబు వద్దని ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా రాజబాబు ఉంటే తాము పనిచేయలేమని కూడా తేల్చిచెప్పారు. అయినప్పటికీ లోకేష్ పెద్దగా పట్టించుకోలేదని తెలిసింది. ఈ కార్పొరేటర్ల వెనుకుండి నాటకాలు ఆడిస్తున్నది గంటా శ్రీనివాసరావు అని భావించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. అంతేకాకుండా వారి ఫిర్యాదును సైతం అంతగా పట్టించుకోకుండా ముందుకు సాగినట్టు సమాచారం. దీంతో చేసేదిలేక సదరు కార్పొరేటర్లు అదే విషయాన్ని గంటాకు వివరించినట్టు తెలుస్తోంది. అంతకుముందే చీపురుపల్లికి పోవాలని సంకేతాలు ఇచ్చినప్పటికీ.. భిన్నంగా ఉన్న ఆయన వ్యవహారశైలిపై టీడీపీ పెద్దలు మండిపడుతున్నారు. ఇదే అదనుగా గంటాను చీపురుపల్లికి పంపనున్నట్టు కొన్ని మీడియా సంస్థలకు టీడీపీ పెద్దలు లీకులిచ్చారు. అంతేకాకుండా భీమిలి సీటును జనసేనకు కేటాయిస్తున్నట్టు కూడా ఇరు పార్టీలు లీకులిచ్చుకుంటున్నారు. ఏదీ ఏమైనప్పటికీ ప్రతీ ఎన్నికలకు సీటు మార్చే అలవాటున్న గంటాకు చివరకు పోటీ చేసేందుకు నియోజకవర్గమే దొరకకపోవడం విశాఖ రాజకీయాల్లో చర్చనీయాంశమవుతోంది.

కుప్పంలో చంద్రబాబు ఓటమి ఖాయం

- ఈ విషయం భువనేశ్వరికీ తెలుసు
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



కొమ్మాది: కుప్పంలో చంద్రబాబు ఓడిపోతారని భువనేశ్వరికీ తెలుసని.. అందుకే బాబుకు విశ్రాంతినిచ్చి తాను పోటీ చేస్తానని మనసులో మాట చెప్పిందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు కుప్పం నియోజకవర్గాన్ని పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పంను రెవెన్యూ డివిజన్‌గా, మున్సిపాలిటీగా చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు సంగతి కుప్పం ప్రజలకు అర్థం అయిందని, ఇక బాబు రాజకీయాలకు గుడ్‌బై చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ నెల 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.450 కోట్లతో కుప్పం ప్రజలకు తాగునీరు అందించే ప్రాజెక్ట్ ప్రారంభిస్తారన్నారు. చంద్రబాబు 14 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేసి చూపిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం నుంచి చంద్రబాబు లేదా భువనేశ్వరి ఎవరు పోటీ చేసినా ఓడిపోవడం ఖాయమన్నారు. కుప్పంతో సహా 175కు 175 ఎమ్మెల్యే స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుచుకుంటుందన్నారు. దొంగ ఓట్లతో కుప్పం నుంచి చంద్రబాబు గెలుస్తున్నారని.. ఇప్పుడు దొంగ ఓట్లను తొలగించడంతో ఆయన అయోమయంలో పడ్డారన్నారు.

ప్రభుత్వ చొరవతో..

బీఆర్‌టీఎస్ బాధితులకు సమన్యాయం

- అన్ని విధాలా ఆదుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నిర్వాసితులకు అండగా నిలిచిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి
- పూర్తిగా నిరాశ్రయులైన 102 మందికి 48 గజాల చొప్పున పట్టాలు అందజేత



బాధితులకు టీడీఆర్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు(ఫైల్)

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి తొలిపావంచా నుంచి పాత అడవివరం కూడలి వరకు జరుగుతున్న బీఆర్‌టీఎస్ విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారి త్యాగాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గుర్తించి.. వారికి అన్ని విధాలా న్యాయం చేసింది. ఆది నుంచీ అడవివరంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కృషి ఫలితంగా వారికి సమన్యాయం జరిగింది.

అడవివరంలోని పాత గోశాల జంక్షన్ నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు 2.5 కిలోమీటర్ల మేర బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ రెండు ఫేజ్‌ల్లో జరగాల్సి ఉంది. తొలిఫేజ్‌లో పాత గోశాల నుంచి తొలిపావంచా వరకు బాధితులకు నష్టపరిహారం మూడేళ్ల కిందటే అందించడంతో ఇప్పటికే పలువురు నిర్వాసితులు నిర్మాణాలు తొలగించి.. మిగిలిన స్థలాల్లో తిరిగి నిర్మాణాలు చేసుకున్నారు. రెండవ ఫేజ్‌లో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి తొలిపావంచా నుంచి అడవివరం జంక్షన్ వరకు విస్తరణకు సంబంధించి నిర్వాసితులకు నష్ట పరిహారం అంశం కొలిక్కిరాకపోవడంతో దీర్ఘకాలంగా ఈ సమస్య అలానే ఉండిపోయింది. నగరంలో ట్రాఫిక్ పెరగడం, సింహాచలం దేవస్థానానికి పెరిగిన భక్తుల రాక, స్వామి చందనోత్సవం, గిరి ప్రదక్షిణ రోజుల్లో నెలకుంటున్న రద్దీ కారణంగా పాత అడవివరం నుంచి పాత గోశాల వరకు ట్రాఫిక్ సమస్య ఉంటోంది. ఈ సమస్య పరిష్కారానికి భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అధికారులు స్థానికులను ఒప్పించారు. ఈ నేపథ్యంలో తొలిపావంచా నుంచి పాత అడవివరం జంక్షన్ వరకు రోడ్డుకిరువైపులా ఉన్న వారు తమ నిర్మాణాలను తొలగించారు. మొదటి నుంచి అడవివరం గ్రామాన్నే నమ్ముకుని ఉన్న బాధితులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి అండగా నిలిచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సహా దేవదాయశాఖ కమిషనర్, కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ ఇతర అధికారుల దృష్టికి పలుమార్లు బాధితుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం చూపారు.

1:4 టీడీఆర్‌ల అందజేత

280 మంది బాధితులుండగా వారికి మెరుగైన ప్యాకేజీ వచ్చేందుకు ముత్తంశెట్టి చర్యలు చేపట్టారు. ముఖ్యంగా బాధితులందరికీ 1:4 టీడీఆర్‌లు వచ్చేలా విశేష కృషి చేశారు. ఆమోదయోగ్యమైన భవన నష్టపరిహారంను అందించారు. అలాగే పూర్తిగా ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన 102 మందికి జగనన్న కాలనీల్లో 48 గజాల స్థలం పట్టా వచ్చేలా కృషి చేశారు. నాలుగు రోజుల కిందటే బాధితులకు అడవివరంలోనే పట్టాలు పంపిణీ చేశారు.

మిగులు స్థలాల్లో నిర్మాణాలకు అనుమతి

ఇల్లు కోల్పోగా మిగిలిన స్థలంలో తిరిగి నిర్మాణం చేసుకునేందుకు దేవదాయశాఖ నుంచి అనుమతి తప్పనిసరి కావడంతో.. ఆ శాఖ కమిషనర్ దృష్టికి కూడా ఈ విషయాన్ని ముత్తంశెట్టి తీసుకెళ్లారు. ఈ తరుణంలో దేవదాయ శాఖ కమిషనర్ ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు మిగిలిన స్థలంలో తిరిగి నిర్మాణం చేసుకునేలా ఇటీవలే ఉత్తర్వులు జారీ చేశారు. ఇలాంటివి తొలిపావంచా నుంచి అడవివరం కూడలి వరకు 267 నిర్మాణాలు ఉండగా.. ఇళ్ల మరమ్మతులు, తిరిగి ఇళ్లు నిర్మించుకోవడం, ఫేస్ లిఫ్టింగ్ పనులు చేసుకునేందుకు వీలు కల్పించారు. బాధితుల్లో కొందరికి టీడీఆర్‌ల విలువలో వ్యత్యాసం నెలకొనడంతో.. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డితో కలసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి ముత్తంశెట్టి తీసుకెళ్లారు. భగవంతుడి సేవలో ఉన్న అడవివరం ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. టీడీఆర్‌ల వ్యాల్యూ సమస్య కూడా త్వరలోనే పరిష్కారం కానుంది. బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో ప్రతిపక్షాల విమర్శలకు ముత్తంశెట్టి ఎప్పటికప్పుడు దీటుగా సమాధానం చెబుతూ.. పార్టీలకతీతంగా బాధితులందరికీ సమన్యాయం చేసి ప్రశంసలు అందుకుంటున్నారు.

అబ్బురపరిచిన మిలాన్ ప్రదర్శన

- మిలాన్ విలేజ్, సాంకేతిక ప్రదర్శనను ప్రారంభించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- రక్షణ రంగ ఆవిష్కరణల స్టాల్స్ సందర్శన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



పలు రక్షణ ఉత్పత్తి సంస్థల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్



సాంస్కృతిక ప్రదర్శనలు తిలకిస్తున్న నావికాదళ అధికారులు



భారతీయ సంప్రదాయ నృత్యం అదరహో..



సాంకేతిక ప్రదర్శనలో నేవీ అస్త్రాలు

విశాఖ సిటీ: అనేక దేశాల సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుతో హస్త కళలు.. వస్త్రాలు.. వంటకాలు.. దేశ రక్షణ రంగ సత్తాను చాటేలా అధునాతన యుద్ధ సామగ్రి.. మిస్సైల్స్.. టార్పిడోలు.. డ్రోన్లు.. కనులవిందు చేసే సాంస్కృతిక ప్రదర్శనలు.. ఇలా అనేక ప్రత్యేకతలతో మిలాన్–2024 ప్రదర్శన 58 దేశాల నావికాదళాలకు చెందిన అధికారులు, ప్రతినిధులను మంత్రముగ్ధులను చేసింది. ఒకవైపు మిలాన్ విలేజ్.. మరోవైపు రక్షణ రంగ సంస్థల ఆవిష్కరణల ప్రదర్శనను భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ బుధవారం ఐఎన్ఎస్ శాతవాహనలో ప్రారంభించారు. ముందుగా ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) సహకారంతో నిర్వహించిన మారిటైం సాంకేతిక ప్రదర్శనను కేంద్ర మంత్రి తిలకించారు. డీఆర్‌డీఓ, భారత్ డైనమిక్స్, ఇలా రక్షణ రంగ సంస్థల ఆవిష్కరణలు, వాటి విశిష్టతలను తెలుసుకున్నారు. అనంతరం మిలాన్ విలేజ్‌లో ఇండోనేషియా, శ్రీలంక, మయన్మార్, బంగ్లాదేశ్, వియత్నాం ఇలా పలు దేశాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. అక్కడి వారి సంప్రదాయ దుస్తులు, హస్తకళలను పరిశీలించారు.

ఆకట్టుకున్న ఆవిష్కరణలు

మిలాన్ విలేజ్ సంప్రదాయాలకు అద్దం పట్టగా.. మారిటైం సాంకేతిక ప్రదర్శన అందరినీ అబ్బురపరిచింది. ఒకవైపు వందల కిలోమీటర్ల దూరం నుంచి శత్రుదేశాల స్థావరాలను తుత్తునీయలు చేసే మిసైల్స్.. మరోవైపు శత్రువుల మిస్సైల్స్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే యాంటీ మిస్సైల్స్ సిస్టమ్స్‌ను ప్రదర్శనలో ఉంచారు. అలాగే భారత్ డైనమిక్స్, ఎల్ అండ్ టీ, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ సంస్థలతో పాటు డిఫెన్స్ రంగంలో స్టార్టప్ సంస్థలు సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్, దక్షా అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్ లిమిటెడ్, సైఫ్ ఆటోమేషన్ లిమిటెడ్ ఆవిష్కరణలు భారత రక్షణ రంగ సామర్థ్యాన్ని తేటతెల్లం చేశాయి. 58 దేశాలకు చెందిన నావికాదళాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొని ప్రదర్శనను తిలకించారు. ఈ ప్రదర్శన 23వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మిలాన్ ప్రదర్శనకు వచ్చిన వివిధ దేశాల ప్రతినిధుల కోసం కొనసాగనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.



సెల్ఫీ దిగుతున్న విదేశీ సైనికులు



విదేశీ సైనికులకు సంప్రదాయ స్వాగతం



అలరించిన భారతీయ సంప్రదాయ నృత్య ప్రదర్శన

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం





సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మేయర్ హరివెంకటకుమారి, మంత్రులు ముత్యాలనాయుడు, అమర్‌నాథ్





సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉదయం 11.48 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజని, ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి విశాఖ వచ్చారు. ఇక్కడి నుంచి రోడ్డు మార్గాన విశాఖ శ్రీ శారదా పీఠానికి వెళ్లారు. విమానాశ్రయంలో ఆయనకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎం.వి.వి.సత్యనారాయణ, బి.వి.సత్యవతి, గొడ్డేటి మాధవి, నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్, వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, విశాఖ, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లు మల్లికార్జున, ఎస్.రవిపటాన్ శెట్టి, నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్, జాయింట్ పోలీస్ కమిషనర్ కె.ఫకీరప్ప, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, అడిషనల్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ స్వాగతం పలికా రు. మధ్యాహ్నం 3.27 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు. ఆయనకు మంత్రులు, పార్టీ నేతలు, అధికారులు వీడ్కోలు పలికారు.







సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్, జేసీ మయూర్ అశోక్

చంద్రబాబుకు మాజీ సీఎం పోస్ట్ పర్మినెంట్

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు సెటైర్



సమావేశంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి

డాబాగార్డెన్స్: అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించేందుకు, రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే కొనసాగుతారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ చీకటిమిల్లి మంగరాజు అన్నారు. చంద్రబాబు మాత్రం జీవితాంతం మాజీ సీఎంగానే ఉంటారని ఎద్దేవా చేశారు. డాబాగార్డెన్స్‌లోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో నిర్విరామంగా సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతోందని, సీఎం జగన్ పాలనపై సవాల్ చేసే హక్కు చంద్రబాబుకు లేదన్నారు. డబ్బులు ఉంటేనో, పైరవీలు చేస్తేనే సీఎం జగన్ సీట్లు ఇవ్వరని స్పష్టం చేశారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వ్యక్తులకు కూడా సీట్లు ఇచ్చి.. గెలిపించిన గొప్ప నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. ఆయనపై రాష్ట్ర ప్రజలు విశ్వాసంతో ఉన్నారని, అందుకు ఇటీవల నిర్వహించిన సిద్ధం సభలే నిదర్శనమన్నారు. ఇది సహించలేకే చంద్రబాబు ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకు దమ్ముంటే.. సీఎం జగన్‌లా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వి.సునీల్‌బాబు, సందీప్, అనిల్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కంచరపాలెం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నేతృత్వంలో జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 23 టీవీఎస్ ట్రైనింగ్, సర్వీసెస్ కంపెనీలో 100 ఉద్యోగాల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖతో పాటు అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, రాజమండ్రి, విజయవాడల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికృష్ణ చైతన్య ఓ ప్రకటనలో తెలిపారు.

రెండేళ్ల చిన్నారి కిడ్నాప్ కలకలం

స్థానికుల అప్రమత్తతతో పట్టుబడిన నిందితుడు



చిన్నారితో తండ్రి చిన్న అప్పారావు



నిందితుడు రాపాక ప్రసాద్

సీతమ్మధార: నగరంలోని ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండేళ్ల చిన్నారి కిడ్నాప్ కలకలం రేపింది. అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్‌లో బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఆ చిన్నారిని అపహరిస్తున్న ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. అతన్ని స్తంభానికి కట్టి.. దేహశుద్ధి చేసి అనంతరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన చిప్పాడ చిన్న అప్పారావు కుటుంబం నగరానికి వలస వచ్చేసింది. అతనికి భార్య గాయత్రి, పెద్ద పాప నేహ, రెండో పాప రెండేళ్ల అద్విత ఉన్నారు. అప్పారావు టైలర్ కాగా.. అతని భార్య ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. యథావిధిగా బుధవారం ఆమె విధులకు, పెద్ద పాప స్కూల్‌కు వెళ్లిపోయారు. రెండో పాప అద్విత, తండ్రి చిన్నారావు ఇంటి వద్దే ఉన్నారు. చిన్నారి ఇంటి ద్వారం వద్ద ఆడుకుంటుండగా.. ఆ సమయంలో ఓ వ్యక్తి చిన్నారిని కిడ్నాప్ చేసి పట్టుకుని వెళ్లేందుకు ప్రయత్నించాడు. ఇది గమనించిన స్థానిక యువకుడు శివ వెంటనే అతన్ని పట్టుకున్నాడు. స్థానికులు అక్కడకు చేరుకుని.. ఆ వ్యక్తి పారిపోకుండా స్తంభానికి చేతులు కట్టి దేహశుద్ధి చేశారు. తర్వాత ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు విచారించిన పోలీసులు నిందితుడు తాడేపల్లిగూడేనికి చెందిన రాపాక ప్రసాద్‌గా గుర్తించారు. కాగా.. నిందితుడు పిచ్చివాడు అని ఫిర్యాదులో పేర్కొనాలని పోలీసులు ఒత్తిడి తీసుకొచ్చినట్లు పాప తల్లి ఆరోపించింది. పిచ్చివాడు అని ఎలా రాస్తామని పోలీసులను ఆమె ప్రశ్నించింది. దీంతో దర్యాప్తుకు వస్తామని పోలీసులు చెప్పారని, కానీ రాలేదని ఆమె ఆందోళన వ్యక్తం చేసింది. పోలీసులు సమగ్ర విచారణ చేపట్టి అతన్ని కఠినంగా శిక్షించాలని చిన్నారి తల్లిదండ్రులు కోరారు.

సచివాలయాల్లో పటిష్టంగా ఆధార్ సేవలు

సిబ్బందికి ఆధార్ నమోదు, తప్పులు సరిచేయడంపై ఒక్కరోజు వర్క్‌షాపు



మాట్లాడుతున్న జిల్లా వార్డు, గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి పూర్ణిమాదేవి

మహారాణిపేట: గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు, మార్పుల సేవలను పూర్తిస్థాయిలో అందించాలని జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి పూర్ణిమాదేవి ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం వార్డు, గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులకు ఆధార్ నమోదుపై ఒక్కరోజు రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు పొందేందుకు ఆధార్ మూలమని, దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ఆధార్ కేంద్రాలు నెలకొల్పిందన్నారు. జన్మించిన ప్రతీ ఒక్కరికి ఆధార్ నమోదు చేయాలని, తప్పులు ఉన్నచో సరిచేయాలని సూచించారు. ప్రజలకు నిజాయతీగా సేవలందించి.. వారి మన్ననలు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆధార్ నమోదు, తప్పులు సరిచేయడంపై సచివాలయం సిబ్బందికి అవగాహన కల్పించారు. వారి సందేహాలను స్టేట్ కో–ఆర్డినేటర్ వి.సుందరం, సహాయ సంచాలకుడు బి.బాలుప్రసాద్ నివృత్తి చేశారు. జిల్లా కో–ఆర్డినేటర్ బి.నాయుడు, ఏడీసీ జి.భార్గవ్, జిల్లా ఆధార్ కో–ఆర్డినేటర్ నందవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్ల రద్దు.. రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: పార్వతీపురం–గుమడ స్టేషన్ల మధ్య జరుగుతున్న పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. మరి కొన్ని రైళ్లు రీషెడ్యూల్, దారి మళ్లిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మార్పులు గమనించి ప్రయాణికులు రైల్వేకు సహకరించాలని ఆయన కోరారు.

రద్దు చేసిన రైళ్లు..

ఈ నెల 29 నుంచి మార్చి 5వ తేదీ వరకు విశాఖపట్నం–రాయ్‌పూర్–విశాఖపట్నం (08527/08528) పాసింజర్ స్పెషల్‌ను ఇరువైపులా రద్దు చేశారు. ఈ నెల 29 నుంచి మార్చి 5వరకు విశాఖపట్నం–భవానీపట్న(08504) స్పెషల్, మార్చి ఒకటి నుంచి 5 వరకు భవానీపట్న–విశాఖపట్నం(08503) స్పెషల్ పాసింజర్, ఈ నెల 29 నుంచి మార్చి 5 వరకు విశాఖపట్నం– కోరాపుట్ (08545) పాసింజర్ స్పెషల్, ఈ నెల 29 నుంచి మార్చి 6 వరకు కోరాపుట్–విశాఖపట్నం (08546) పాసింజర్ స్పెషల్ రద్దయ్యాయి. మార్చి ఒకటి నుంచి 4 వరకు విశాఖపట్నం – కోరాపుట్ (18512) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్, మార్చి 2 నుంచి 5 వరకు కోరాపుట్–విశాఖపట్నం (18511) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు ఇవే..

- ఈ నెల 29న ఎర్నాకుళం–టాటా (08190) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా 9.15 గంటలకు బయలుదేరుతుంది.
- మార్చి ఒకటో తేదీన ఈరోడ్– సంబల్‌పూర్(08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 3.45 గంటటలకు బయలుదేరుతుంది.
- మార్చి 3న విశాఖపట్నం–లోకమన్యా తిలక్ టెర్మినస్ (22847) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు 5.30 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరుతుంది.
- మార్చి 2,4వ తేదీల్లో నాందేడ్–సంబల్‌పూర్ (20810) సూపర్‌ఫాస్ట్ 4 గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు నాందేడ్‌లో బయలుదేరుతుంది.

దారి మళ్లించిన రైళ్లు ఇవే..

- ఈ నెల 28న గాంధీధాం–పూరి (22973) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా టిట్లాఘడ్– కేరేజంగా– ఖుర్దారోడ్ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 28, మార్చి 3వ తేదీల్లో ఎర్నాకుళం–టాటా(18190) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా విజయనగరం–పలాస–జరోలి–టాటా మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 29, మార్చి 3వ తేదీల్లో టాటా–ఎర్నాకుళం (18189) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా టాటా–జరోలి–పలాస–విజయనగరం మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 29, మార్చి 2, 3, 5వ తేదీల్లో విశాఖపట్నం–నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్ వయా దువ్వాడ–విజయవాడ–బల్హార్షా మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 29, మార్చి 1, 2, 4వ తేదీల్లో నిజాముద్దీన్–విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్ వయా బల్హార్షా– విజయవాడ–దువ్వాడ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 29, మార్చి 1, 2, 5వ తేదీల్లో పూరి–అహ్మదాబాద్ (12843) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా ఖుర్దారోడ్– కేరేజంగా– టిట్లాఘడ్ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 29, మార్చి 2, 3, 4వ తేదీల్లో అహ్మదాబాద్–పూరి (12844) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా టిట్లాఘడ్ –కేరేజంగా– ఖుర్దారోడ్ మీదుగా నడుస్తుంది.
- మార్చి 2న పూరి–గాంధీధాం (22974) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వయా ఖుర్దారోడ్–కేరేజంగా– టిట్లాఘడ్ మీదుగా నడుస్తుంది.